నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 23 డిసెంబర్ 2024 | MEDAK

నేడు మెదక్ చర్చికి మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): మెదక్ చర్చి శత వసంతాలకు సోమవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు రానున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మెదక్ చర్చిలో జరిగే శత వసంతాల వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అంబరాన్నంటిన ప్రీ క్రిస్మస్ వేడుకలు

రాక్ చర్చిలో ప్రీ క్రిస్మస్ వేడుకల్లో సందడి చేస్తున్న చిన్నారులు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 22: క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక పోతిరెడ్డిపల్లి శివారులోని రాక్ చర్చిలో ఆదివారం ప్రీ క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా చిన్నారులు బైబిల్ క్యారెక్టర్స్‌లో దుస్తులు ధరించి అందరినీ అలరించారు. ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ఏసుపాల్ మాట్లాడుతూ ఈ నెల 25న ఉదయం11 గంటలకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు రవికుమార్, ఆర్కే, ప్రసన్నకుమార్, ప్రసాద్, కిరణ్‌మయి తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పూలబొకే అందజేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

గవర్నర్ పర్యటన ముగింపు: మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్, డిసెంబర్ 22: మెదక్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన ముగిసిందని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదట జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోకి రాగా ఎస్పీ సాదర స్వాగతం పలికి పూలమొక్క అందజేశారు. అనంతరం గవర్నర్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. గవర్నర్ కలెక్టర్, జిల్లా ఎస్పీతో ముచ్చటించారు. మెదక్ చర్చి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సుప్రసిద్ధ మెదక్ చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రార్థనలు ముగించుకొని కొల్చారం మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ జరిగిన నృత్య ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి వారికి ప్రేరణాత్మక ప్రసంగాన్ని ఇచ్చారు. తర్వాత గవర్నర్ పిల్లలతో కలిసి భోజనం చేసి పర్యటనను ముగించుకొని తిరుగు బయలుదేరే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గవర్నర్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసినందుకు సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు. కాగా, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పూలబొకే అందజేసి స్వాగతం పలికారు.

అసౌకర్యాల మధ్యే ఫైర్ స్టేషన్

మంత్రి పొన్నం ప్రభాకర్ ఇలాఖాలో అగ్నిమాపక సేవలకు తరచూ అంతరాయం

- హుస్నాబాద్ రైతు సేవా కేంద్రంలో ఒకే గదిలో కొనసాగుతున్న ఫైర్‌స్టేషన్
- అధికారులు, సిబ్బందికి కనీసం మరుగుదొడ్లు కరువు
- కొత్తభవనం కోసం పలుమార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఒకే గదిలో ఫైర్ ఆఫీసర్ టేబుల్, కంప్యూటర్ టేబుల్

హుస్నాబాద్ మార్కెట్ యార్డులోని రైతు సేవా కేంద్రంలో కొనసాగుతున్న ఫైర్ కార్యాలయం

హుస్నాబాద్, డిసెంబర్ 22: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఫైరింజన్‌కు నీడ లేకుండా పోయింది... అగ్ని ప్రమాదం జరిగిందంటే శరవేగంతో వెళ్లి మంటలార్పి ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చేసే ఫైరింజన్‌కు రక్షణ లేదు. వ్యవసాయ మార్కెట్ యార్డులో దుమ్మూ ధూళితో నిండిపోయి తరచూ రిపేర్లకు వస్తూ సకాలంలో ప్రమాద స్థలానికి చేరుకోలేని స్థితిలో ప్రస్తుతం ఫైరింజన్ కొట్టుమిట్టాడుతోంది...ఫైరింజన్‌కే కాకుండా ఫైర్ అధికారులు, సిబ్బందికి కూడా కనీస సౌకర్యాలు లేక ఏండ్ల తరబడి ఒకే గదిలో ఈ అగ్నిమాపక కార్యాలయం కొనసాగుతోంది... దీనికి సరిపడా అధికారులు, సిబ్బంది ఉన్నప్పటికీ వారికి తగిన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం ఈ కార్యాలయం దుస్థితికి నిదర్శనం... అదే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు సేవా కేంద్రంలో కొనసాగుతున్న అగ్నిమాపక (ఫైర్ స్టేషన్) కార్యాలయం.

14ఏండ్లుగా అరకొర వసతులతో..

హుస్నాబాద్ ప్రాంతంలో తరచూ అగ్ని ప్రమాదాలతో పాటు ఇతర ప్రమాదాలు చోటు చేసుకుంటున్న తరుణంలో వాటిని నివారించేందుకు అప్పటి ప్రభుత్వం 2010 మార్చి 22వ తేదీన కాంట్రాక్టు పద్ధతిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు సేవా కేంద్రం భవనంలో దీనిని ఏర్పాటు చేశారు. 2017 ఏప్రిల్ వరకు కాంట్రాక్టు పద్ధతి కొనసాగింది. అనంతరం రెగ్యులర్ సిబ్బందిని నియమించినప్పటికీ కాంట్రాక్ట్ ఫైరింజనే నడిచింది. 2023 జనవరి 5వ తేదీన పూర్తి స్థాయి అధికారిక ఫైర్ స్టేషన్‌గా మార్చుతూ అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇందుకు మార్కెట్ యార్డులోని 10గుంటల స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ.1.18కోట్లను సైతం కేటాయించారు. టెండర్ సకాలంలో పూర్తి కాకపోవడం, ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో భవన నిర్మాణం ఆగిపోయింది. కొత్త సర్కారు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా దీని గురించి పట్టించుకునే వారు లేరు. స్వయానా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్‌లో అరకొర వసతులతో ఫైర్‌స్టేషన్ ఉండటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక గదిలో ఫైర్ అధికారితో పాటు సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది.

కనీస వసతులు సున్నా...

హుస్నాబాద్ ఫైర్ స్టేషన్‌కు పూర్తి స్థాయిలో అధికారులు, సిబ్బంది ఉన్నప్పటికీ కనీస వసతులు మాత్రం లేవు. ఫైర్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు లీడింగ్ ఫైర్‌మన్లు, ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్లు, ఐదుగురు ఫైర్‌మన్లు, ఏడుగురు హోమ్‌గార్డులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా ఒకే గదిలో విధులు నిర్వహించాల్సి వస్తోంది. రెండు టేబుళ్లు, నాలుగు కుర్చీలు తప్పా ఇతర ఫర్నిచర్ ఇక్కడ కనబడదు. ఫైరింజన్ పార్కు చేసేందుకు కూడా కనీసం షెడ్డు కూడా లేదు. ఇటీవల లాండ్రీషాపులో మంటలు లేవగా ఆర్పేందుకు వెళ్లిన ఫైరింజన్ మధ్యలోనే సాంకేతిక లోపం వల్ల ఆగిపోయింది. కొత్త భవనం పూర్తయ్యే వరకు మరో భవనం కేటాయించాలని ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను పలుమార్లు కోరినప్పటికీ ఎలాంటి స్పందన లేదని అధికారులు వాపోతున్నారు.

హుస్నాబాద్‌లో రైతు సేవా కేంద్రం ఆవరణలో పార్క్ చేసిన ఫైరింజన్

కొత్త ఫైరింజన్ మంజూరు...

ప్రస్తుతం ఉన్న ఫైరింజన్ తరచూ రిపేరుకు వస్తుండటం, పాత మోడల్ కావడంతో కొత్త వాహనం మంజూరు కోసం విన్నవించగా ఇటీవల మంజూరైనట్లు అధికారులు తెలిపారు. కొత్త వాహనం వస్తే ఎక్కడ పార్క్ చేయాలో అర్థం కావడం లేదని తలపట్టుకుంటున్నారు. ఫైర్ కార్యాలయం భవన నిర్మాణం గురించి పలుమార్లు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు కానీ స్పందన లేదు. ప్రస్తుతం భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం సరిపోదని కనీసం ఎకరం స్థలం కేటాయించాలని సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించడం లేదు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి హుస్నాబాద్ ఫైర్ స్టేషన్‌ను సకల సౌకర్యాలతో నిర్మాణం జరిగేలా స్థలం, నిధులు కేటాయించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రస్తుతం ఉన్న ఫైర్ కార్యాలయం అసౌకర్యాలతో ఉన్నది. అధికారులు, సిబ్బంది మొత్తం చాలా ఇబ్బందులు పడుతున్నామని ఉన్నతాధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. కొత్త భవన నిర్మాణం త్వరగా ప్రారంభించడంతో పాటు, అప్పటి వరకు మరో భవనాన్ని కేటాయించాలని విన్నవించాం. కానీ ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. ఫైర్‌స్టేషన్‌కు 30గుంటల స్థలం కావాలని ఆర్డీవోకు సైతం వినతి పత్రం ఇచ్చాం. కొత్త ఫైరింజన్ వస్తోంది. దానిని ఎక్కడ ఉంచాలో అర్థం కావడం లేదు. ప్రస్తుతం ఉన్న భవనాన్ని ఖాళీ చేయాలని రైతు సేవాకేంద్రం పాలకవర్గం వారు ఒత్తిడి తెస్తున్నారు. ఫైర్ స్టేషన్‌కు సరైన సౌకర్యాలతో కూడిన భవనం, స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నాం.

– సీహెచ్ రాజయ్య, ఫైర్ ఆఫీసర్, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా

సింగూరు ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలి

శాసన మండలిలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, డిసెంబర్ 22(నమస్తే తెలంగాణ): సింగూరు ప్రాజెక్టుకు నీటిని వెంటనే విడుదల చేయాలని శాసన మండలిలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాకు సంబంధించి వనదుర్గాభవాని ప్రాజెక్టు, సింగూరు ప్రాజెక్టులో నీళ్లు ఉన్నాయన్నారు. యాసంగిలో రైతులు వరినాట్లు ప్రారంభించినప్పటికీ ఇంతవరకు ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయలేదన్నారు. దీంతో సుమారు 30వేల ఎకరాలు సాగు చేసే రైతులు నీళ్లు వదులుతారా లేదో అనే భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి నీళ్ల విడుదలకు సంబంధించి ప్రణాళికను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తిమ్మక్కపల్లిలో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

పంటలకు సాగునీరు అందించాలి

- మల్లన్నసాగర్‌లో నీళ్లు ఉన్నా వినియోగించలేని స్థితిలో సర్కారు
- గుంట పంట ఎండినా సహించేదిలేదు
- పెండింగ్‌లో ఉన్న ప్రతి కాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని చదువుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, డిసెంబర్ 22: మల్లన్నసాగర్‌లో పుష్కలంగా నీళ్లు ఉన్నా రైతులకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని తిమ్మక్కపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టులు పూర్తి చేసినట్లు గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని మల్లన్నసాగర్ జలభాండాగారంగా ఉందన్నారు.ఎమ్మెల్యేగా గెలువగానే ఏడాది క్రితం నుంచి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నుంచి ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా పిల్ల కాల్వలు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. పిల్ల కాల్వలు పూర్తి చేస్తే చెరువులు నింపి రైతులకు సాగునీరు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అసంపూర్తిగా ఉన్న కాల్వల నిర్మాణాలను పక్కన పెట్టి హైదరాబాద్‌కు నీళ్లు తీసుకుపోవడానికి పనులు చేపడుతున్నారని, వీరికి రైతుల మీద ఎంతప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. ఉన్న కాల్వల్లో గడ్డి, చెత్తాచెదారం, నాచుతో పచ్చిగడ్డి ఏపుగా పెరిగిందన్నారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితి ఏర్పడటంతో యాసంగి సాగు ప్రశ్నార్థకరంగా మరిందన్నారు. యాసంగి వరకు కాల్వలు నిర్మించి సాగునీళ్లు విడుదల చేయకపోతే పంటపొలాలు ఎండిపోవడం ఖాయమన్నారు. ఒక గుంట పొలం ఎండినా అది ప్రభుత్వ వైఫల్యమే అవుతుందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో కాల్వలు పూర్తి చేసి చెరువులు, కుంటలు, పంటపొలాలకు సాగునీరు విడుదల చేయాలని, లేనిపక్షంలో హైదరాబాద్‌కు మల్లన్నసాగర్ నుంచి తరలించే నీటిని వేలాది మంది రైతులతో కలిసి అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మనోహరావు, పార్టీ రాయపోల్, తొగుట మండలాల అధ్యక్షులు వెంకటేశ్వరశర్మ, జీడిపల్లి రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, రాష్ట్ర యువజన నాయకులు కాడి రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు రాజిరెడ్డి, రామచంద్రంగౌడ్, రాజిరెడ్డి, మురళీగౌడ్, నీవన్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

మాట్లాడుతున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, డిసెంబర్ 22: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో మృతి చెందిన విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో షాదిహా మెహరీన్ అనే విద్యార్థిని మృతికి సంబంధించిన వివరాలను పాఠశాల అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత గురుకుల పాఠశాల ఉన్నతాధికారులతో మాట్లాడారు. ప్రమాదవశాత్తు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యార్థిని మృతికి సంబంధించి విచారణ చేపట్టి, ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల అధ్యక్షులు తట్టు నారాయణ, సంజీవ్‌రెడ్డి ఉన్నారు.

హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న రాములునాయక్

బంజారాల హక్కుల కోసం ఉద్యమాలు

- సంత్‌శ్రీ సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి
- ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్

హుస్నాబాద్, డిసెంబర్ 22: దేశంలోని 15 కోట్ల బంజారాల హక్కుల సాధన కోసం జాతీయ స్థాయి ఉద్యమాలు చేయనున్నట్లు ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములునాయక్ తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని గిరిజన భవన్‌లో జరిగిన ఆలిండియా బంజారా సేవా సంఘ్ జిల్లా స్థాయి ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ స్థాయిలో బంజారాల ఐదు ప్రధాన డిమాండ్లతో డిసెంబర్ 3న న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించామన్నారు. ఈ ధర్నాకు తెలంగాణ నుంచి 500 మంది గిరిజనులు తరలివచ్చారని గుర్తుచేశారు. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో బంజారాల అంశాన్ని చేర్చాలని, బంజారా నాయకుడైన తపశ్రీ రామారావు మహరాజ్‌కు భారతరత్న ఇవ్వాలని, పార్లమెంట్‌లో లక్కీషా బజార్ విగ్రహం ఏర్పాటు చేయాలని, ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో హాతీరామ్ ఆస్తులకు రక్షణ కల్పించడంతో పాటు టీటీడీబోర్డులో బంజారా సభ్యుడి నియామకం చేయాలని, తెలంగాణలో సంత్‌శ్రీ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలనే డిమాండ్లు ఉన్నాయన్నారు. సంఘాన్ని తెలంగాణలో బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామని, వచ్చే నెలలో రాష్ట్ర స్థాయిలో భారీ బహిరంగ సభ పెట్టి సీఎంతో పాటు అన్ని పార్టీల ప్రతినిధులను ఆహ్వానించనున్నట్లు వివరించారు. సమావేశంలో బంజారా నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌పవార్, తిరుపతి నాయక్, లావుడ్య వీరన్ననాయక్, కైలునాయక్, భూక్యా వీరన్న, ముడావత్ శ్రీను, భూక్యా తిరుపతి, సరోజన, భూక్యా రమేశ్‌నాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.

మా వాటా మాకు దక్కాలి

- రేవంత్ సర్కార్ మాట నిలబెట్టుకోవాలి
- ఫిబ్రవరి 3న 'వెయ్యి గొంతులు-లక్ష డప్పులు'
- దళిత చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత పల్లె సంజీవయ్య

ఎన్‌హెచ్‌ఏఐ 161 రహదారిపై డప్పులతో ప్రదర్శన ఇస్తున్న మాదిగ దండోరా నేతలు

చౌటకూర్, డిసెంబర్ 22: ఎవరి సొత్తు మాకు అక్కర్లేదని, మా వాటా మాకు దక్కాలని దళిత చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత పల్లె సంజీవయ్య, కార్యక్రమ రాష్ట్ర కో ఆర్డినేటర్, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 3 హైదరాబాద్‌లో జరుపతలపెట్టిన 'వెయ్యి గొంతులు–లక్ష డప్పులు' మహా ప్రదర్శన సన్నాహక సమావేశం సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలంలోని తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద ఆదివారం జరిగింది. జై భారత్ రాష్ట్ర కో కన్వీనర్ కాశపాగ ఇమ్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దళితులంతా ఐక్యంగానే ఉన్నారని, వారిని అనవసరంగా విడగొడుతున్నారంటూ జరుగుతున్న ప్రచారం పచ్చి బూటకమన్నారు. గ్రామాల్లో బావులు, బస్తీలు వేర్వేరుగానే ఉన్నాయని, ఏనాడూ కలిసి లేరన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినప్పటికీ ప్రభుత్వ రిజర్వేషన్లు అందని కులాలు నేటికి అనేకం ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమన్యాయం చేసి సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ముప్పై ఏండ్ల దండోరా పోరాట ఫలితంగా ఆగస్టు 1న సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించిందని గుర్తుచేశారు. వర్గీకరణ లేకుండా జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాల్లో నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 3వ తేదీన హైదరాబాద్‌లో జరుపతలపెట్టిన 'వెయ్యిగొంతులు–లక్ష డప్పులు' మహా ప్రదర్శనకు మాదిగలు లక్షలాదిగా తరలిరావాలని పల్లె సంజీవయ్య, రమేశ్ కోరారు. కవులు, కళాకారులు, విద్యావంతులు, నాయకులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. జనవరి 3వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు రథయాత్ర నిర్వహిస్తామన్నారు. అనంతరం సంగారెడ్డి–నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై డప్పులతో ప్రదర్శన నిర్వహించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నాగిరెడ్డిపల్లి కృష్ణంరాజు, ఏర్పుల కృష్ణ, నాగులపల్లి శ్రీహరి, రచయితలు సొన్నాయిల బాలరాజు, అమృత్ బండారి, కోవూరి నర్సింహులు, నాయకులు ఎర్రోళ్ల రమేశ్, లింగం, గణపతి, ఏర్పుల రాజేందర్, శ్రీకాత్, శివకుమార్ పాల్గొన్నారు.


సిద్దిపేట కలెక్టరేట్‌లో పెరిగిన కలుపు మొక్కలు, గడ్డి

సిద్దిపేట కలెక్టరేట్.. కళావిహీనం

ప్రజలకు పాలన చేరువ చేసేందుకు బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి అత్యాధునిక హంగులతో సమీకృత కలెక్టరేట్ల నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. విశాలంగా కలెక్టరేట్లు నిర్మించడంతో పాటు హెలిప్యాడ్, పచ్చదనంతో కూడిన లాన్, గ్రీనరీ వంటి సౌకర్యాలు కల్పించారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక కలెక్టరేట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. సిద్దిపేట కలెక్టరేట్ ఆవరణలో పెంచిన మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. గడ్డి, కలుపు మొక్కలు పెరిగి పరిసరాలు అధ్వానమయ్యాయి. కలెక్టరేట్ చుట్టూ పరిసరాలు ఎటుచూసినా చెత్తమయంగా మారాయి. పరిసర ప్రాంతాల్లో పాములు, తేళ్లు తిరుగుతున్నాయి. కలెక్టర్‌తో పాటు కలెక్టరేట్ సిబ్బంది కలెక్టరేట్ నిర్వహణను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట, డిసెంబర్ 22

కలెక్టరేట్ వెనుక భాగంలో పెరిగిన కలుపు మొక్కలు, గడ్డి

మొండి గోడల మధ్యే జీవనం

- సిద్దిపేట జిల్లా గజ్వేల్ రోడ్డు విస్తరణలో ఇంటిని కూల్చిన అధికారులు
- డబుల్ బెడ్ రూమ్ కేటాయించని వైనం
- అధ్వానంగా నాగుబాయి పరిస్థితి
- ఆశ్రయం కల్పించాలని బంధువుల వినతి

గజ్వేల్‌లో కూలిన గోడ మధ్యనే జీవనం కొనసాగిస్తున్న నాగుబాయి

గజ్వేల్, డిసెంబర్ 22: రోడ్డు విస్తరణలో భాగంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని కోటమైసమ్మ మార్గంలో అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లను కూల్చివేశారు. రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు అప్పట్లో ప్రభుత్వం సూచించింది. అధికారులు నిరుపేదలకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన బాధితులు రోడ్డున పడ్డారని, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గజ్వేల్ పట్టణానికి చెందిన నాగుబాయి ఇంటిని రోడ్డు విస్తరణలో అధికారులు కూల్చివేశారు. అధికారులు ఆమెకు ఇస్తామన్న డబుల్ బెడ్ రూమ్ నేటికీ ఇవ్వకపోవడంతో కూల్చిన గోడల మధ్య రోడ్డుపై జీవనం కొనసాగిస్తుంది. కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో భర్త మృతి చెందాడు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేయగా ఓ కూతురు తల్లిని చేరదీసి తన వద్దనే ఉంచుకుంటుంది. రోడ్డు విస్తరణలో ఇంటిని కోల్పోయిన నాగుబాయికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయిస్తామన్న అధికారులు నేటికీ ఇవ్వకపోవడంతో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తుంది. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు కుమార్తెలు హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చికిత్స చేయించి అద్దె ఇంటికి తీసుకరాగా, అద్దె ఇంటి యజమాని నిరాకరించడంతో నాగుబాయికి రోడ్డు విస్తరణలో కూలిన గోడల మధ్యనే మంచం వేసి ఆశ్రయం కల్పించారు. కూలిన గోడల మధ్యనే జీవనం సాగిస్తున్న నాగుబాయికి వెంటనే మున్సిపల్, రెవెన్యూ అధికారులు డబుల్ బెడ్ రూమ్ ఇంటిని కేటాయించి ఆశ్రయం కల్పించాలని ఆమె బంధువులు కోరుతున్నారు.

మెదక్ జిల్లా కొడిపల్లి మండలం తునికిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఉపరాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, డిసెంబర్ 22: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 25న జరిగే కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి హాజరుకానున్నారని, పర్యటన కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఉపరాష్ట్రపతి ఆర్గానిక్ వ్యవసాయంపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తారని, ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్న రైతులతో నేరుగా మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ ఉదయ్‌కుమార్, అదనపు కలెక్టర్ నగేశ్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.